# అనుభవిస్తాడు, కాని...

[ ఒక యథార్థ సంఘటన ]

[ఆమె అంటే అతనికి అనురాగంవుంది. ఆమెను నిరభ్యంతరంగా అనుభవిస్తాడు. కాని తన్ను అర్థాంగిగా స్వీకరించమని ఆమె అడిగితేమాత్రం ఛీ-ఛీ వస్తుంది. ఇది మగవాని దౌర్జన్యాలలో ఒకటి. —సంపాదకుడు.]

రచయిత:
## కొత్తపల్లి ఇందిరాదేవి

౧

ప్రసాదు యవ్వనం మళ్ళిపోయింది. అతని పాలు పొంగిపొరలి చల్లారిపోయినవనే చెప్పాలి. కాని విధి అతనిని పట్టి పడతోసినది వూబిలో.

అది మధ్యాహ్నసమయం. అప్పుడే అవుట్ డోరుడ్యూటీనుంచి యింటికివచ్చి భోజనంచేసి గ్రామఫోనుపెట్టుకు శ్రమతీర్చుకుంటున్నాడు హంసతూలికాతల్పంమీద మహారాజులాగున. ఎవరిమంచముమీదవారు మహారాజులేకదా!

ఇంతలో అతని చిన్నకొమరుడు రఘు పరుగు పరుగునవచ్చి 'నాన్నగారూ! టెలిఫోనులో ఎవరో మిమ్ములను పిలుస్తున్నారండీ' అన్నాడు.

ఎవరైవుంటారా అని చరచర లేచి వెళ్లాడు. టెలిఫోను చేత తీసుకొని 'ఎవరండీ?' అన్నాడు అతిశాంతంగా.

'నమస్తే! నేను నారాయణరావుని' అని జవాబు.

'ఓరి! నువ్వట్రా! ఏంసమాచారం? బాగా వున్నావా? ఎప్పుడొచ్చావు వూరునుంచి?' అన్నాడు ప్రసాద్.

'బ్రదర్! నేను యీరోజే వచ్చాను. కాని యీవేళే వెళ్ళిపోతున్నాను. నీతో కొంత అత్యవసర కార్యం ఒకటి మాట్లాడి పోవాలి. నీ బసకి రావడానికి నాకు తీరికలేక ఫోనుచేస్తున్నాను, మరోలా అనుకోక వీలుచేసుకుని మైలాపూరులో నా బసవద్ద కలుసుకోవాలి. ఇది నా ప్రార్థన. తరువాత దేవరచిత్తంనాభాగ్యం' అన్నాడు నారాయణరావు.

ఏదో చిరపరిచితుడు నారాయణరావు పాపం ఏంప్రమాదస్థితిలో వున్నాడో ఒకసారి చూచివద్దామని వెంటనే చొక్కా వేసుకొని మైలాపూరు వెళ్లాడు ప్రసాద్.

౨

నారాయణరావు బసలో అటు నిటు తచ్చాడుతున్నాడు. అతని ముఖంలో నెత్తురులేదు. పాలిపోయినట్టువుంది. అతన్ని ఏదో గడ్డు సమస్య ఎదుర్కొన్నట్టు తోచింది. అతనికి ప్రసాదు దర్శనం ఎండిపోయిన చేనుమీద నీరుపెట్టినట్టు అనిపించింది.

'ప్రసాద్! నీకోసమే కాచుకుని వున్నాను. పద బస్సులో మాటాడదాం' అన్నాడు నారాయణరావు.

పూనమల్లిరోడ్డు వెళ్లాలని బస్సు ఎక్కారు. బస్సులోకూడా అతన్ని అంతగా వేదిస్తున్న విషయాన్ని గూర్చి అతడు ప్రస్తావింపలేదు. హృదయభారంచే వూరుకున్నాడేమో శాంతంగా చూస్తామనుకున్నాడు ప్రసాద్. బస్సు భారత్ మూవిటోన్‌కు ఎదురుగుండా ఆగింది.

'దిగు' అన్నాడు నారాయణరావు. ప్రసాద్ దిగాడు. అక్కడికి

తన్ను ఎందు కతీసుకువచ్చాడో తెలియలేదు. కాని అతనితో మాట్లాడకండా అనుసరిస్తున్నాడు ప్రసాద్. ఇద్దరు లోపలికి వెళ్ళారు.

అక్కడ మేనేజరును దర్శించి నారాయణరావు 'అయ్యా' ఇక్కడ కమల అనే అమ్మాయి వున్నది ఒక్కసారి పిలిపించండి' అన్నాడు.

మొదట ఆ మేనేజరు అట్టివ్యక్తి ఎవరూ అక్కడలేదే అన్నాడు.

కాని ఆమె లక్షణాలు అన్నీ వర్ణిస్తే 'ఆహా! ఆమెనా? ఆమె పేరు కమలకాదే సరళ అంటారే!' అన్నాడు.

అంటూనే ఆమెను బయటకు పిలిపించాడు.

అదే మొదటి సందర్శనం ప్రసాదుకి, కమలకును. ఒకరినొకరు క్రీకంట చూచుకొన్నారు. నారాయణరావు కమలతో చాలాసేపు మాటాడి ఆమె కష్టసుఖాలు కనుక్కొని వెళ్ళిపోయే సమయాన ప్రసాద్‌కి ఆమెను పరిచయం చేశాడు.

## 3

ఒకనాడు కమల స్వయంగా ప్రసాదుయింటికి వచ్చేసింది. 'నీట ముంచినను పాలముంచినను మీదే భారం. నాకింకెవరూ లే'రని ఆ బేల బేలగా పలికింది. కాంత కన్నీటికి కరుగని మానవ హృదయం వుండదు. అందులోను కామోద్రిక్తుడైనవాడా? తనంతట తాను వచ్చి తనపాదములమీద పడిన కమలను కాలదన్నలేక పోయాడు ప్రసాద్. అతనిలో నివురు కప్పివున్న కామాగ్ని ప్రజ్వరిల్లినది.

కమల రూపవతి, గుణవతి, అంతకు మించిన విద్యావతి. తల్లి భ్రష్టురాలవ్వటంవల్ల సంఘంలో ఆమెకు గౌరవం లేకపోయింది. కాగా సినీమాలో చేరి తారగా కీర్తి గణించాలనుకుంది. ఆమె రూపలావణ్యములకు ముగ్ధులై ఆమెను అన్నివిధాలా ఉపయోగించుకోవాలనుకున్నారు సినీమా నిర్మాతలు. ఆమె మానధనాన్ని దోచుకోవాలని చూస్తున్న సినీమా నిర్మాతలబారి నుండి రక్షించమని కోరింది కమల.

కాగా ఆమెకు ప్రత్యేకంగా ఇల్లు ఒకటి చూచి అందులో వుండమని తనకుతోచిన ధనసహాయం చేశాడు ప్రసాద్. ఆపరిచయం ముదిరి ఆమెతో సరససల్లాపాల్లోకి దిగింది. తుదకు ప్రణయాబ్ధిలో నోలలాడ మొదలు పెట్టాడు. స్వర్గసౌఖ్య మనుభవించాడు. కమల తన బహిఃప్రాణంగా తలచాడు. ఆమెను తన ప్రణయదేవతగా పూజించాడు. ఆమెనువిడబాసి ఒక్కనిముసమైనా వుండలేకపోయేడు.

ఆమెను ఇంతగా ప్రేమించి కామించినా ఆమెను ఒక వెలయాలిగాను, ధనముకొరకు మానమును విక్రయించుకొను నికృష్టజీవిగాను చూచేవాడే కాని ఆదమరచి హృదయమును పూర్తిగా ఆమెఅధీనం చేయలేదు. తన సంసారిక సాంఘిక జీవనాలకు ఆమె అడ్డురాకూడదని అతని మతము.

స్త్రీకి మానముకన్న మహత్తర వస్తువేది? మానరక్షకుడు భర్త. కాగా ప్రతిస్త్రీ భర్తకై అన్వేషిస్తుంది. తగిన భర్త దొరికితే అతనికి తన సర్వస్వము వశం చేస్తుంది.

దరిద్రసాగరంలో అంతూ దరిలేక ఈదులాడే తనకు ప్రసాదుని ప్రసాదించాడు కదా భగవంతుడని కమలం మురిసిపోయింది. అతనిని భర్తగా పొందాలని వాంఛించింది. అతని ప్రణయం స్థిరమని వూహించి మురిసిపోయింది. నారాయణరావు చేతిలో పొందిన పరాభవంకూడా ఆమెకు గుణపాఠం కాలేదు.

# నవ్వు

నవ్వు కేవల హాస్యరస సంబంధియును టపు వీలులేదు.

అది యీ ప్రపంచములో బహు కారణ జన్యమును, భిన్నకార్య జనకమును గూడ నగుచున్నది.

విద్వేష వ్యంజకమగు వికపు నవ్వు- ఆత్మార్జవానంద సూచకమగు నమాయికపు నవ్వు— వెడవిల్తు వికారములవ్యక్తీకరించు చింతనవ్వు— పరిహాసద్యోతకమగు వంకరనవ్వు--బ్రహ్మకైనం గారణము బయలుపఱుప వశముగాని వాతులాలయము దారినవ్వు—

ఇట్టి వెన్నియో రకముల నవ్వులున్నవి.

—కూచి నరసింహము

ప్రసాదునకు అయాచితంగా లభించిన ఆ అబలారత్నంమీద ఆశ మెండు. ఆమె బాహులతలో బంధింపబడి ఆమె అధరామృతం ఆస్వాదించు సమయాన తను ఇంద్రుడో, చంద్రుడో, ఉపేంద్రుడో ఐవుండాలని మురిసిపోతాడు. కాని ఆమెను తన భార్యగా పరిగణించడానికి భయపడతాడు. పాడు సంఘానికి వెఱచి ఆ ప్రణయవృత్తాన్ని అతడు కూకటివ్రేళ్ళతో కూలదోసుకోవలసి వచ్చింది.

౪

కమల రూపురేఖలు అనేక మంది కాముకులను ఆకర్షించాయి.

కలకలలాడే ఆ కమల ముఖ ముఖకమలంలోని అధరామృతమునకై కాముకులలో పోరాటము చెలరేగింది. సంఘందృష్టిలో కమల ఒక వ్యక్తి, వస్తువుకాకపోవడమే దీనికి కారణమేమో!

అంటే స్త్రీకివ్యక్తిత్వము లేదని— ఆమె తనదీ అనిపించుకోడానికి వెరచిన ప్రసాదుకూడా ఆమెను జారవిడవడానికి ఇయ్యకొనలేదు.

చిరపరిచితుని మోహమాటంవల్ల పరిచయభాగ్యం పడసి తుదకు ఆమెవలలో తగుల్కొని తేనెలో పడ్డ ఈగలా ప్రసాదు బయటకు రాలేక పోయాడు,

ఉద్యోగగర్వంచే అందుబాటులోనికి వచ్చిన స్త్రీరత్నములను చెరబట్టే ఒక పెద్దమనిషి ప్రసాదు పైన హుంకరించాడు. ప్రసాదు వెలమబిడ్డ. ఆకడజాతివాని బెదిరింపులకు తల వొగ్గి భీతిచెంది అతని హృదయకమలమగు కమలను విడనాడలేదు.

ఆమె అతనిని పెనవేసుకుపోయినప్పుడల్లా పెండ్లి చేసుకోమని అదే పనిగా ప్రాధేయపడితే అతనిబుద్ధి తిరిగిపోయింది. ఆమె పెండ్లి చేసుకోమని అడిగినప్పుడల్లా అతనికి జమాజెట్టీల్లావున్న తనకుమారులు, ప్రాచీన తంగేడు లావుండే తన భార్య అతనిదృక్పథంలో గోచరించేవారు ఆమెను వివాహం చేసుకోడానికి అతనికి ధైర్యం చాలేది కాదు.

మృత్యుదేవత గుమ్మంలో కాచుకొనివున్నా మానవుడు రేపటి సంగతి ఆలోచిస్తూ వుంటాడు. అది మానవసహజం. అలాటప్పుడు యవ్వనంలోవున్న కమల తనభావిని గురించి యోచించుకొనుటలో ఆశ్చర్యంలేదు. ప్రసాదునకు అది అనుమానాస్పదమయింది. తన యవ్వనమంతా ప్రసాదువంటి కాముకులకు అర్పణచేసి తన వార్ధకావస్థలో చేయవలసినపనేమిటా అన్నది కమలను ఎదుర్కొన్న ఒక విషమసమస్య. ముసలితనంలో తమను పోషించి రక్షిస్తారనే కదా మానవుడు సంసారసాగరం దుఃఖమయమైనా దానిలో మునుకుతున్నది?

అప్పటిలో ప్రసాదునకు ముందుచూపు లేదు. తనను వివాహం చేసుకోమని ఆమె అడిగినప్పుడల్లా ఆమెను అనుమానిస్తూ వచ్చాడు. అది ఇతరు లెవరో తనను వంచించడానికి పన్నిన పన్నాగం అనుకున్నాడు.

కమల అందరివలె వ్యభిచారిణి కాదని అతనికి తెలుసు, విధివశంచే మిత్రునిచే విడువబడి తనకు సంక్రమించిన స్వర్గసౌఖ్యమనిన్నీ తెలుసు. కాని ఆమె భావిజీవితాన్ని గురించి చిన్న మెత్తైనా అతడు యోచింపలేదు. ఆమె 'నన్ను పెండ్లిచేసుకోండి' అని అడిగినప్పుడు అతడు మూగి అయ్యేవాడు.

౫

కమలకు ఇప్పుడు వేరొకనితో వివాహం ఐంది.

కమలను వివాహం చేసింది ప్రసాదే అయివుండవచ్చు,

కాని కమలకు ప్రసాద్ పట్ల విశ్వాసానికి బదులు విముఖత కలిగింది. తీయని కబుర్లు చెప్పి తన సర్వస్వము మారగొని తుదకు ఆ ప్రణయమును భగ్నంచేసి తన్ను అన్యులకు వప్పగించాడుకదా అని ఆమె బాధ.

ప్రసాదుకి నేటికికూడా ఆమె మీది అనురాగం పోలేదు ఆమె ప్రతిమను నిత్యము ఆరాధిస్తాడు.

చేజిక్కినదానిని చేతులారా అన్యులకు ధారపోసి ప్రతిమను ఆరాధించే ప్రముఖులలో ప్రసాదు ఒకడైనాడు. సంఘమునకు తన ప్రణయసామ్రాజ్యమును బలియిచ్చాడు. కాని ఆమాట అతడు అనడు.